సాక్షి
నంద్యాల
శనివారం ׀ 9 ׀ డిసెంబర్ ׀ 2023



శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాస చివరి శుక్రవారం మల్లన్న క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేష పూజలు చేశారు.



560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం 560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో కేసీ కాల్వకు 552 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

కర్నూలు(సెంట్రల్): జగనన్న విద్యా దీవెనలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో నగదు జమ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించే అవకాశముంది. ఈ నేపథ్యంలో ముందస్తుగా సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. నగరంలోని ఒమెగా హాస్పిటల్ ప్రాంగణంలో హెలిప్యాడ్, సభా వేదిక కోసం కేంద్రీయ విద్యాలయ సమీపంలో ఖాళీ స్థలాలను పరిశీలించారు. పూర్తిస్థాయి పర్యటన షెడ్యూల్ ఖరారు కాగానే ప్రొటోకాల్ ప్రకారం సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరి వెంట కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు తదితరులు ఉన్నారు.

మల్లన్న సేవలో దేవదాయశాఖ మంత్రి



మంత్రి దంపతులకు స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు దర్శించుకున్నారు. శుక్రవారం మంత్రి దంపతులు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగానే ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు. అనంతరం వారిని అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

క్వింటా ఎండుమిర్చి రూ.21,400

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చి యార్డులో శుక్రవారం సూపర్–10 రకం ఎండు మిర్చి క్వింటా గరిష్ట ధర రూ.21,400 పలికింది. అదేవిధంగా మధ్యస్థ ధర రూ.20వేలు, కనిష్ట ధర రూ.18,500 నమోదైంది. ఇదే రకం తాలు కాయ గరిష్ట ధర రూ.11,100, మధ్యస్థ ధర రూ.10,700, కనిష్ట ధర రూ.6,500 పలికినట్లు యార్డ్ ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 9, 10 తేదీల్లో రెండవ శని, ఆదివారాల్లో తరగతులు నిర్వహిస్తే ఆయా పాఠశాలలపై చర్యలు తప్పవని డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో రెండు రోజుల పాటు తరగతులు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహిస్తే గుర్తింపు రద్దు చేస్తామన్నారు. ఎంఈఓలు, సీఆర్పీలు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



కోటకందుకూరు సమీపంలో సాగులో ఉన్న కర్జూర

సర్కారు ప్రోత్సాహం.. ఉద్యాన వికాసం

- ముమ్మరంగా ఉద్యాన తోటల అభివృద్ధి
- సాగుకు వీలుకాని కొండ ప్రాంతంలో విస్తృతంగా పెంపకం
- వివిధ సబ్సిడీ పథకాలతో అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- పూల మొక్కల పెంపకానికి మరింత సాయం

వ్యవసాయ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వెనుక ప్రభుత్వ దూరదృష్టి ఉంది. అద్వితీయ ప్రోత్సాహం ఉంది. గతంలో ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రెండు, మూడు శాతం నిధులు మాత్రమే ఉద్యాన శాఖకు కేటాయించేంది. వైఎస్సార్‌సీపీ ప్రభుతం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను ఆదుకునేందుకు వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి భారీ ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఎలాంటి పథకమైనా రాయితీ నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తూ అన్నదాతల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.



ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది

చెట్టుకు కాసిన జామ కాయలను చూపిస్తున్న ఈమె పామక్క. బాచేపల్లి గ్రామానికి చెందిన ఈమె ఐదు ఎకరాల్లో మూడేళ్లక్రితం 330 నిమ్మ, 180 జామ మొక్కలు నాటుకుంది. పొలం తిప్ప (అడవి)లో ఉండటంతో రాళ్లు ఎత్తి పోసేందుకు రూ.49,620, మొక్కలు తెచ్చుకునేందుకు రూ.27,000, గుంతలు తీసి మొక్కలు నాటుకునేందుకు రూ 1.25 లక్షలు, మొదటి ఏడాది మందులకు రూ.5,000, సేద్యాలకు రూ.5,000, మొక్కల సంరక్షణకు రూ.25,000లతో పాటు అంతర్ పంటలు సాగు చేసుకున్నందుకు ఎకరాకు రూ.వెయ్యి చొప్పున 5 ఎకరాలకు రెండేళ్లకు రూ.10 వేలు ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. మరో ఏడాది కూడా మరో రూ.5వేలు వేయనుంది. 'చెట్లు ఏపుగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ సాయం లేక పోతే మేము చెట్లను బతికించుకోలేం. మరో ఏడాది లోగా పంట దిగుబడులు ప్రారంభమవుతాయి' అని ఆమె సంతోషంతో వివరించింది.

ఆళ్లగడ్డ: మూసధోరణి పంటల సాగు కష్టాల నుంచి రైతులను బయట పడేయాలన్న సంకల్పంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉద్యానవన, ఎన్ఆర్ఈజీఎస్, ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో లాభదాయకమైన సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతోంది. జిల్లాలో ప్రస్తుతం 49,106 హెక్టార్లలో విస్తీర్ణంలో పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ పంటలు సాగు చేశారు. ఈ పంటల విస్తీర్ణం మరింత పెంచేందుకు రాయితీలు కల్పిస్తోంది. పంటల సాగుపై అవగాహన పెంచడమే గాకుండా మార్కెట్‌లో పంట డిమాండ్ వంటి అంశాలపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తోంది. సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలికి లాభదాయక పంటల వైపు మళ్లించేందుకు అరటి, బొప్పాయి, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, టమాటా, వంకాయ, మిరప, పసుపుతో పాటు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, ఔషధ పంటల సాగుకు మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు మంజూరు చేస్తోంది. కొత్తగా మొక్కలు నాటడంతో పాటు 25, 30 ఏళ్లతోటలను పునరుద్ధరించేందుకు ఆర్థిక సాయం చేస్తోంది.

బీడు భూముల్లో సైతం..

రాయలసీమలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి కరువు తాండవిస్తుండటంతో వైఎస్సార్ హయాంలో డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు శ్రీకారం చుట్టి పండ్ల తోటల సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. నీటి వసతి లేకపోయినా బీడు భూముల్లోనూ ఉద్యాన పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తూ బావి, బోరు లేకున్నా సమీపంలోని వంకలు, వాగులు, చెరువులు, కుంటలు, ఇంకుడు గుంతల నుంచి నీళ్లు తెచ్చి మొక్కలను బతికుంచుకునే విధంగా తీసుకుంటున్న చర్యలు సన్న, చిన్నకారు రైతులకు వరంగా మారి కరువును తరిమేస్తున్నారు.

ఎకరాకు రూ.లక్షకు పైగా రాయితీ

ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు 5 ఎకరాల్లోపు పొలం ఉన్న అన్ని వర్గాలకు చెందిన రైతులకు మొక్కల కొనుగోలు, గుంతల తవ్వకం, డ్రిప్ పరికరాల ఏర్పాటు, భూమిని చదును చేసేందుకు ట్రాక్టర్ బాడుగ, ఎరువులు, క్రిమిసంహారక మందులు, కాపలా, అంతర్‌పంటల సాగు, నీటి తడులకు ఇలా ప్రతి దానికి ప్రభుత్వమే రైతుకు డబ్బు చెల్లిస్తోంది. ఏడాదికి ఎకరాకు రూ.లక్ష మేర రైతులకు రాయితీ సాయం అందుతుంది. ఇలా మూడేళ్ల పాటు ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వమే పూర్తి ఖర్చు భరిస్తుంది. తొలి ఏడాదితో పాటు మూడో ఏడాది కూడా నిర్వహణకు నిధులిస్తారు.

యాంత్రీకరణకు రాయితీలు

ఉద్యాన యాంత్రీకరణకు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోంది. ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులు 50 శాతం, ఇతరులు 40 శాతం రాయితీ పొందొచ్చు. మినీ ట్రాక్టర్‌కు రూ.75 వేలు, పవర్ టిల్లర్ రూ.40 వేలు, తైవాన్ స్ప్రేయర్ రూ.8 వేలు రాయితీ కల్పిస్తున్నారు. కరువు పరిస్థితుల్లో ఉద్యాన పంటలను రక్షించుకునేందుకు తోటల్లో నీటి కుంటల నిర్మాణానికి ఉద్యానశాఖ ద్వారా కమ్యూనిటీ నీటికుంట రూ.20 లక్షలు, పంట కుంట రూ.75 వేలు అందజేస్తున్నారు.

ఏఏ పంటలు..

ఉద్యాన, ఎన్ఆర్ఈజీఎస్, ఏపీఎంఐపీ తదితర శాఖల సమన్వయంతో అన్ని రకాల పండ్లతోటల సాగును ప్రోత్సహిస్తారు. చీని, మామిడి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, అల్లనేరేడు, చింత, మునగ, ఆపిల్‌బేర్, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు వివిధ రకాల పూలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ పంటలు, తోట పంటల సాగుపై ఆసక్తి చూపేవారికి రాయితీ నిధులిచ్చి పోత్సహిస్తున్నారు.



డబ్బుల పంట పండినట్లే

మామిడి మొక్కకు నీళ్లు పోస్తున్న ఈ మహిళ పేరు రమాదేవి. రుద్రవరం గ్రామానికి చెందిన ఈమె మూడు ఎకరాల్లో మామిడి మొక్కలు నాటుకుంది. సేద్యాలకు, మందులకు, నీరు పోయడానికి, మొక్కల సంరక్షణకు క్రమం తప్పకుండా ఇప్పటి వరకు ప్రభుత్వం సుమారు రూ .1 లక్షపైనే బిల్లులు మంజూరు చేసింది. 'మరో రెండేళ్లలో మామిడి చెట్లు కాపునకు వస్తాయి. కాపు మొదలైతే ఏటా మాకు డబ్బుల పంట పండినట్లే' అని రైతు రమాదేవి ఆనందం వ్యక్తం చేస్తోంది.

జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం

పంట రకం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
అన్ని రకాల పండ్ల తోటలు	7,669	5,43,856
కూరగాయలు	14,549	8,08,476
పూల తోటలు	531	9,755
సుగంధ ద్రవ్యాలు	26,079	2,16,400
ఔషధ పంటలు	38	180
తోట పంటలు	240	436
మొత్తం ఉద్యానవన తోటలు	49,106	15,79,103



బాచేపల్లి కొండలో డ్రైల్యాండ్ కింద సాగైన మామిడి

లాభసాటి సేద్యమే లక్ష్యం



సన్న, చిన్నకారు రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఉద్యాన పంటలు సాగుపై రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తూ సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఉద్యాన పంటల సాగుకు ముందుకు వచ్చిన రైతులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నాం. పండించిన పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. లాభసాటి సేద్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

– నాగరాజు, జిల్లా ఉద్యానాధికారి, నంద్యాల

టీడీపీ నేత కుటుంబానికీ సంక్షేమ ఫలాలు



గుంప్రమాన్‌దిన్నె గ్రామ టీడీపీ నాయకుడి తండ్రికి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: కుల, మత, రాజకీయాలకతీతంగా పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం గుంప్రమాన్‌దిన్నెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి పథకాలపై ఆరా తీశారు. ఈక్రమంలో టీడీపీ నేత కుందూరి ప్రతాపరెడ్డి తండ్రి కుందూరి రామిరెడ్డికి సంక్షేమ పథకాల ద్వారా రూ.2.35 లక్షలు అందాయి. ప్రతాపరెడ్డికి కూడా రైతు భరోసా, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, సున్నా వడ్డీ పథకాల ద్వారా మరో రూ.2 లక్షలు అందిన విషయం తెలుసుకుని ప్రజలు ప్రభుత్వాన్ని అభినందించారు.

పాఠశాలల నిర్వహణకు రూ.7 కోట్లు మంజూరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 29 మండలాలకు ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాలల నిర్వహణకు రూ.7కోట్ల నిధులు మంజూరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, సర్వశిక్ష అభియాన్ అధికారి లలితలు తెలిపారు. శుక్రవారం డీఈఓ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లలో టాయ్‌లెట్లు, ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు, ఇతర పనులకు ఖర్చు చేయాలన్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అకౌంట్లలో నిధులను జమ అవుతాయన్నారు.

ముస్లింమైనారిటీల అభివృద్ధికి కృషి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నంద్యాల(న్యూటౌన్): ముస్లింమైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. స్థానిక వైఎస్సార్‌నగర్‌లో రూ.12 కోట్లతో ఏర్పాటు చేయనున్న మైనారిటీ ఉర్దూ కళాశాల, వసతి భవన నిర్మాణాలకు శుక్రవారం భూమి పూజా చేశారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజ్ భవనానికి రూ.1.99 కోట్లు, వర్కింగ్ ఉమెన్ వసతి భవనాలకు రూ.2.10 కోట్లు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి భవనాలకు రూ.4.21 కోట్లు, ప్రీ మెట్రిక్ బాలుర వసతి భవనాలకు రూ.2.10 కోట్లు, ముస్లిం మైనారిటీల కోసం సద్భా మండపం కోసం రూ.1.40 కోట్లు కలిసి మొత్తం రూ.11.82 కోట్లతో భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ జగనన్న హయాంలో తప్ప ముస్లిం మైనారిటీలకు ఏ ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ అత్యధిక ముస్లింల జనాభా ఉన్న నంద్యాల ప్రాంతానికి ఆలస్యమైనా ఉర్దూ జూనియర్ కాలేజీ, ఇతర భవనాలు రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దాదాపు రూ.12 కోట్ల వ్యయంతో 6 భవన నిర్మాణాలకు భూమి పూజ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నౌమాన్, మైనారిటీ వెల్ఫేర్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ సబిహా పర్వీన్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ కాజీ అబ్దుల్ కలాం, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, కౌన్సిలర్ సావిత్రమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జీవం పోసిన 'గాలేరు నగరి'

- వర్షాభావ పరిస్థితుల్లో బోర్లలో తగ్గిన భూగర్భ జలాలు
- పైర్లు ఎండుతుండటం చూసి రైతులు ఆందోళన
- ఎమ్మెల్యే రామిరెడ్డి చొరవతో 600 క్యూసెక్కుల నీటి విడుదల
- ఆయిల్ ఇంజిన్ల సాయంతో పైర్లకు నీళ్లు కట్టుకుంటున్న అన్నదాత

గాలేరు నగరికి నీళ్లు విడుదల చేయడంతో పైర్లు జీవం పోసుకుంటున్నాయి. ఇటీవల తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి వ్యవసాయ బోర్లలో నీళ్లు ఇంకిపోవడంతో పైర్లు వాడుపట్టాయి. ఆందోళన చెందుతున్న రైతన్నలను చూసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధికారులతో మాట్లాడి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించడంతో ఆయిల్ ఇంజిన్లు, విద్యుత్ మోటార్ల ద్వారా పంటలను అన్నదాతలు కాపాడుకుంటున్నారు.



గాలేరు నగరి క్యాలలో పారుతున్న నీరు



మిరప పైరుకు నీళ్లు కడుతున్న రైతు మద్దయ్య

కొలిమిగుండ్ల: గాలేరు కాల్వ వెంట అవుకు, సంజామల, కొలిమిగుండ్ల మండలాలకు సంబంధించి రామాపురం, బెలుం, బెలుం శింగవరం, రామిరెడ్డిపల్లె, పేరుసోముల, కోటపాడు, కమ్మవారిపల్లె, పెద్ద వెంతుర్ల గ్రామాలున్నాయి. ఈగ్రామాల పరిధిలో వెయ్యి ఎకరాల మేర మిరప సాగు చేశారు. జొన్న, మినుము, శనగ తదితర పంటలు మరో వెయ్యి ఎకరాల్లోపు ఉన్నాయి. ఒక్క పెద్దవెంతుర్ల పరిధిలోనే 300 ఎకరాల్లో మిరప సాగులో ఉంది. వర్షాలు లేకపోవడంతో బోర్లలో నీళ్లు ఇంకి పోయి రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. పెద్ద వెంతుర్ల రైతులు రెండుసార్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వద్దకు వెళ్లి సమస్యను విన్నవించారు. గాలేరు నగరి కాల్వకు నీటిని విడుదల చేయాలని కోరడంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి కాల్వకు నీటిని విడుదల చేయించారు.

అవుకు రెండో టన్నెల్ ప్రారంభంతోనే సాధ్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల అవుకు రెండో టన్నెల్ ప్రారంభించారు. అందులో భాగంగా గోరుకల్లు నుంచి అవుకు రిజర్వాయర్‌లోకి నీటిని నింపారు. ఏ ఒక్క రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మూడు రోజుల క్రితం అవుకు మండలం చెర్లోపల్లె సమీపంలోని హెడ్‌రెగ్యులేటర్ వద్ద గేట్లు ఎత్తి గాలేరు నగరి వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించారు. పెద్ద వెంతుర్ల సమీపంలో కాల్వలో రైతులు నీరు నిల్వ ఉండేందుకు అడ్డుకట్టు వేసుకున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కాల్వకు నీటిని విడుదల చేయడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కాల్వ సమీపంలోని రైతులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆయిల్ ఇంజిన్లు, కరెంట్ మోటార్ల సాయంతో పైపులు ఏర్పాటు చేసుకొని మిరప తదితర పైర్లకు నీళ్లు కట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. కాల్వకు నీళ్లు వదలడం వల్ల వ్యవసాయ, తాగునీటి బోర్లలోనూ భూగర్భ జలాలు పెరిగాయి.

మాటల్లో చెప్పలేని సంతోషం



పది ఎకరాల్లో మిరప సాగు చేశాను. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి వచ్చింది. ఉన్న ఒక్క బోరు నుంచి నీళ్లు అంతంత మాత్రమే వస్తుండేవి. ఏం చేయాలో దిక్కు తోచలేదు. ఇదే సమయంలో గాలేరు కాల్వకు నీళ్లు వదలడంతో మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది. కాల్వలో నీళ్లు నిల్వ ఉండటం వల్ల బోర్లు రీచార్జ్ అవుతున్నాయి. కాల్వ నీళ్లతో రెండు నెలల పాటు పంటలకు కట్టుకోవచ్చు. – ధర్మారాయుడు, రైతు

ఎమ్మెల్యే మేలు మర్చిపోలేం



కాల్వ పక్కనే ఎకరం పొలం ఉండటంతో జొన్న సాగుచేశాను. బోరులో మొదట నీళ్లు ఉన్నా వర్షాలు లేక అడుగంటిపోయాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పుణ్యమా అని కాల్వకు నీళ్లు వదలడంతో పైపులు వేసుకొని పైర్లకు నీళ్లు కట్టుకుంటున్నాను. నీళ్లు లేక పంట ఎండిపోతుందని భయపడ్డాను. ఇప్పుడు సంతోషంగా ఉంది.

– పీటర్, రైతు

అద్దె బాధలు తప్పాయి



గతంలో సొంత ఇల్లు లేక బాడుగ ఇంటిలో నివాసం ఉంటూ నెలకు రూ.1,500 అద్దె చెల్లించేందుకు ఇబ్బంది పడేవాళ్లం. నా భర్త పెద్ద వీరారెడ్డి సిమెంట్ బేల్దార్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇంటి కోసం అధికారుల చుట్టు తిరిగినా పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాతే ఇల్లు మంజూరైంది. నిర్మాణం ప్రారంభించి పూర్తి చేసుకున్నాం. రూ.1.80 లక్షలు బిల్లు మంజూరు చేయడం సంతోషంగా వుంది. నెల వస్తే ఇంటి బాడుగ చెల్లించాలనే బాధ తప్పింది. మా కుటుంబం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – లక్ష్మి నరసమ్మ, ఇంజేడు, ఉయ్యాలవాడ మండలం

సంక్షేమ పథకాల వల్లే..



మాకు నాలుగెకరాల పొలం ఉంది. వ్యవసాయంతో పాటు కూలీపనులకు, ఉపాధి పనులకు వెళ్తుంటాం. మా కూతురు కనకబాయి పాణ్యం బాలికల రెసిడెన్సియల్ స్కూల్‌లో 10వ తరగతి, కుమారుడు తేజస్ నాయక్ అనంతపురం జిల్లా హిందూపురం అంధుల రెసిడెన్సియల్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే మా లాంటి పేద కుటుంబాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా జీవనం సాగిస్తున్నాం. మా ఇద్దరి పిల్లలకు అమ్మఒడితో పాటు మాకు రైతు భరోసా పెట్టుబడి సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– లక్ష్ నాయక్, సందీబాయి దంపతులు, బుగ్గానిపల్లె తండా, బేతంచెర్ల మండలం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బనగానపల్లె రూరల్: రోడ్డుప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిన్నరాజుపాళెం గ్రామానికి చెందిన బాలనరసింహులు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు కాశీవిశ్వనాథ్(22) ఇటీవల డిగ్రీ పూర్తి చేసి, గౌండ పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం యాగంటిపల్లెలో పనులు ముగించుకుని తన స్నేహితుడిని పలకరించేందుకని బైక్‌పై బనగానపల్లెకు బయల్దేరాడు. కృషి విజ్ఞాన కేంద్రం వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో కాశీవిశ్వనాథ్ తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం బనగానపల్లె వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఎంఈ ఆమోదించాకే ఖర్చు చేశాం

- కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): తమ ప్రతిపాదనలను డీఎంఈ ఆమోదించాకే కాలేజ్ డేకు ఖర్చు చేశామని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజ్ డేకు డీఎంఈ అనుమతి లేకుండా చేశారని, రూ.20లక్షల దాకా డబ్బును వృథా చేశారని ఈనాడు దినపత్రికలో రాసిన కథనాలు అవాస్తవమని పేర్కొన్నారు. కాలేజీ మైదానం మరమ్మతులకు స్పోర్ట్స్ కమిటీ ఆమోదంతో రూ.1,99,440, ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్‌కు కల్చరల్ కమిటీ ఆమోదంతో రూ.1,20,000, కల్చరల్ కమిటీ ఆమోదంతో ఆడిటోరియంలో 80 చైర్ల రిపేరీకి రూ.1,20,107, స్పోర్ట్స్ కమిటీ ఆమోదంతో స్పోర్ట్స్ మెటీరియల్ కొనుగోలుకు రూ.1,01,770, వాలీబాల్, బాడ్మింటన్ కోర్ట్, త్రోబాల్ కోర్టు, మైదానంలో జంగిల్ క్లియరెన్స్‌కు, జ్ఞాపికలు, బహుమతులు తదితరాలకు రూ.2,80,000, కల్చరల్ కమిటీ ఆమోదంతో స్పోర్ట్స్ డే, కాలేజ్ డే సెలబ్రేషన్స్‌కు రూ.6,30,000.. కలిపి రూ.14,51,317 మొత్తాన్ని కేఎంసీ డెవలప్‌మెంట్ సొసైటీ నిధి నుంచి ఖర్చు చేశామని తెలిపారు.

13న వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు

నంద్యాల టౌన్: మెడికల్ కళాశాల, సర్వజన ఆసుపత్రిలో సీనియర్ రెసిడెంట్ వైద్యుల నియామకానికి ఈనెల 13న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.స్వర్ణలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఓబీజీ, అనస్తీషియా, పల్మనాలజి, రేడియాలజి, ఎమర్జెన్సీ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల్లో నియామకాలు చేపడతామన్నారు. ఆసక్తి కలిగిన వైద్యులు సంబంధిత సర్టిఫికెట్లతో FOR COLLEGE DEVELOPMENT SOCIETY పేరున రూ.1000 డీడీ తీసుకుని ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు.

రమణీయం.. లక్ష దీపోత్సవం

- బుగ్గరామేశ్వర క్షేత్రంలో కనులపండువగా కల్యాణం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


లక్ష దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు


స్వాముల వారికి కల్యాణం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని దంపతులు

ఓర్వకల్లు: హరహర మహాదేవ.. శంభో శంకర.. పాహిమాం, రక్షమాం అంటూ భక్తుల నినాదంతో కాల్వబుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రం మార్మోగింది. లక్ష దీపోత్సవంతో వెలుగులీనింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, ఆలయ ధర్మకర్త మండలి సంయుక్త ఆర్థిక సౌజన్యంతో కార్తీక మాసం మూడో శుక్రవారం లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. ఆలయ గర్భగుడి దగ్గర నుంచి భాజాభజంత్రీల మధ్య పల్లకీలో తీసుకెళ్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కొలువుంచారు. ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ వేదమంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా స్వాముల వారి కల్యాణం జరిపించారు. దాదాపు గంటపాటు సాగిన స్వాముల వారి కల్యాణ తంతును భక్తులు కనులారా వీక్షించి ధన్యులయ్యారు. కల్యాణోత్సవం అనంతరం లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, పాడుపులక్ష్మీ మండల సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు దీపాలను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 1,200 మంది దంపతుల చేత దీపోత్సవం నిర్వహించారు. భక్తులు వెలిగించిన దీప కాంతులతో క్షేత్రం శోభిల్లింది. ఆలయ అర్చకులు లక్ష్మీనారాయణశర్మ కార్తీక దీపోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. ఉత్సవం ముగిసిన తర్వాత భక్తులకు అల్పాహారాన్ని అందజేశారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

స్వాముల వారి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాల్వబుగ్గ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ ఆలయ ఈఓ. డీఆర్‌కేవి ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చంద్ర పెద్దస్వామి, జీకే వెంగన్న, ధర్మకర్త మండలి సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రమాదాల నివారణకు తరచూ తనిఖీలు చేయాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన


మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): అన్ని పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ముందుస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాస్థాయి ప్రమాదాల నివారణ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి కమిటీలో సభ్యులుగా ఉన్న ఎస్పీ జి.కృష్ణకాంత్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ. నారాయణరెడ్డి, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ఒక చిన్న నిర్లక్ష్యం ఎంతో మంది ప్రాణాలు పోయేందుకు కారణమవుతుందన్నారు. ప్రమాదాల నివారణకు తరచూ తనిఖీలు చేయాలన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, సిబ్బందితోపాటు సమీపంలో నివాస ఉంటున్న ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ.నారాయణరెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర స్థాయి క్రైసిస్ గ్రూపు ఆదేశాల మేరకు ఫిబ్రవరిలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో మాక్ డ్రిల్ నిర్వహించామని, డిసెంబర్ 21న ఆల్కలీస్ పరిశ్రమలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ మునిప్రసాదు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మీ, ఆర్‌టీఓ రమేష్, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య పాల్గొన్నారు.

బోగస్ ఓట్లను తొలగించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

నంద్యాల: బోగస్ ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాతో కలిసి ఆయన శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు జిల్లాలో బోగస్ ఓట్లను తొలగించాలని అధికారులను కోరామన్నారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ బోగస్ ఓట్లు చేర్పించుకునే అలవాటు టీడీపీ నాయకులకు ఉందన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ బోగస్ ఓట్లను తాము చేర్పిస్తున్నట్లు టీడీపీ నేతలు తమపై అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ 2024లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు.

ఎల్లెల్సీలో 450 క్యూసెక్కుల నీటి ప్రవాహం

- 15 వరకు నీటి విడుదలకు అవకాశం

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) ఆంధ్ర సరిహద్దు 250 కి.మీ వద్ద శుక్రవారం 450 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఈ నెల 10వ తేదీ వరకు ఏపీ వాటా నీరును వదులుతున్న టీబీ బోర్డు అధికారులు కర్ణాటక రైతు సంఘం నాయకుల డిమాండ్ మేరకు 15వ తేది వరకు కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవంగా కాలువకు వదిలే ఏపీ వాటా నీటిని ఇక్కడి రైతులతో పాటు కర్ణాటక రైతులు మిరప, ఇతర పంటలకు వాడుకునే వీలుంది. ఇదిలాఉంటే టీబీ డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1,633 అడుగులు కాగా.. శుక్రవారం 1,591.50 అడుగులతో 12.212 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 648 క్యూసెక్కులు కాగా.. ఔట్‌ఫ్లో 2,498 క్యూసెక్కులుగా నమోదైంది. గతేడాది టీబీ డ్యాంలో ఇదే సమయానికి 1,628 అడుగుల వద్ద 89 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వీడిన హత్య కేసు మిస్టరీ

- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న సీఐ ఎరిసా వలి, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది

కోసిగి: జిల్లెడాకుల నాగరాజు హత్య కేసును కోసిగి పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన నాగిరెడ్డి అలియాస్ చేపల రాజును అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎరిసా వలి తెలిపిన వివరాల మేరకు.. కోసిగిలోని గాంధీనగర్‌కు చెందిన జిల్లెడాకుల నాగరాజు ఆడవారితో చనువుగా ఉండేవాడు. అదే కాలనీకి చెందిన నాగిరెడ్డి అలియాస్ చేపల రాజుకు గిట్టేది కాదు. వ్యక్తిగతంగా మనస్పర్థ పెంచుకుని నాగరాజును హతమార్చేందుకు పథకం పన్నాడు. స్థానిక గుజిరీ దుకాణంలో వేటకొడవలిని కొనుగోలు చేసి.. గత నెల 30వ తేదీ తెల్లవారుజామున బహిర్భూమి వెళ్లే సమయంలో అక్కడే కాపు కాచి బైక్‌పై వస్తున్న నాగరాజును వేటకొడవలితో తల, గొంతు భాగంలో నరికి, హత్య చేసి పరారయ్యాడు. గురువారం మధ్యాహ్నం చింతకుంట రోడ్డులో చేపల రాజును అరెస్ట్ చేసి విచారించగా.. తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తిని, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో కోసిగి, కౌతాళం ఎస్‌ఐలు సతీష్‌కుమార్, నరేంద్రకుమార్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐ కాలేకపోయానని మనస్తాపం

- పురుగు మందుతాగిన యువకుడు


చికిత్స పొందుతున్న రాజు

పత్తికొండ రూరల్: ఎస్‌ఐ కాలేకపోయానని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం పత్తికొండ మండల పరిధిలోని పందికోన గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు, లక్ష్మి దంపతుల కుమారుడు ఆర్వేటి రాజు డిగ్రీ వరకు చదువుకున్నాడు. ప్రభుత్వం విడుదల చేసిన సచివాలయ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకుని ఉద్యోగాన్ని సాధించలేకపోయాడు. గతంలో ఎస్‌ఐ నోటిఫికేషన్‌లో శారీరక దేహధారుడ్య పరీక్షలు పూర్తి చేసుకుని రాత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. ఎలాగైనా ఎస్‌ఐ కావాలని కలలు కని రెండోసారి ఎస్‌ఐ పోస్టుకు దరఖాస్తు చేసుకుని శారీరక దేహదారుడ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి రాత పరీక్ష రాశాడు. రెండు రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో అర్హత సాధించలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. పొలంలో పంటకు మందు పిచికారీ చేసేందుకు వెళ్లి అక్కడే పురుగు మందు తాగి విషయాన్ని తండ్రి శ్రీనివాసులుకు ఫోనులో సమాచారం అందించాడు. గ్రామస్తులతో కలిసి పొలానికి చేరుకున్న శ్రీనివాసులు కుమారుడిని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

కూల్‌డ్రింక్ అనుకొని కుక్క మందు తాగిన బాలిక

- పాప పరిస్థితి విషమం

గోనెగండ్ల: కూల్‌డ్రింక్ అనుకొని కుక్క గాయానికి వాడే మందును తాగి ఏడేళ్ల బాలిక ప్రాణం మీదకు తెచ్చుకుంది. ఈ ఘటన పెద్దమరివీడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాలిక బంధువులు, గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కేశన్న, రోషమ్మలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. అందులో పెద్ద కూతురు పల్లవికి ఏడేళ్ల వయస్సు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం పిల్లలను అవ్వ దగ్గర వదిలి తల్లిదండ్రులు పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. పెంచుకున్న కుక్కకు దెబ్బతగలడంతో గాయం మానేందుకు మందు సీసాను తెచ్చి ఇంటి అరుగుపైన పెట్టారు. ఆరుబయట ఆడుకొని ఇంటికి వచ్చిన పల్లవి కూల్‌డ్రింక్ సీసా అనుకుని కుక్కమందు తాగేసింది. స్పృహ కోల్పోవడంతో గమనించిన అవ్వ కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి చికిత్స నిమిత్తం హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యులు కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు. పల్లవి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

క్లుప్తంగా

అక్రమంగా గ్రావెల్ తరలింపు

- 3 హిటాచీలను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు


సీజ్ చేసిన హిటాచీ వద్ద మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): ఓర్వకల్లు మండలం నన్నూరు, కల్లూరు మండలం తడకనపల్లె గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 863, 1292/2లో గ్రావెల్‌ను అక్రమంగా తరలించారని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గ్రావెల్ తరలింపునకు ఉపయోగించిన మూడు హిటాచీలను సీజ్ చేశామన్నారు. అక్రమ గ్రావెల్ తరలిస్తున్నారనే సమాచారంతో ఆకస్మికంగా దాడులు చేశామన్నారు. సీజ్ చేసిన హిటాచీలను వీఆర్‌ఓ సతీష్‌చంద్రకు అప్పగించామన్నారు. తనిఖీల్లో గనుల శాఖ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి


కాశీం(ఫైల్)

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామానికి చెందిన రైతు కాశీం(46) పొలంలో పాముకాటుకు గురై మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. గురువారం జొన్న పైరుకు నీరు పారించేందేకు వెళ్లాడు. ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో పొలంలోనే ఉండిపోయింటాడేమో అని కుటుంబీకులు అనుకున్నారు. శుక్రవారం ఉదయం విగతజీవిగా పడి ఉండటం చూసిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆళ్లగడ్డ ఆస్పత్రికి తరలించగా పాము కాటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గురమ్మతో పాటు కూతురు ఉంది.

ఆటో ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన ఎలీషా

గడివేముల: ఆటో ప్రమాదంలో శుక్రవారం ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామానికి చెందిన పలువురు గౌండ కూలీలు పనుల నిమిత్తం ఉదయం ఆటోలో నంద్యాలకు బయలుదేరారు. నంద్యాల-నందికొట్కూరు రహదారిలోని గ్రంధివేముల గ్రామం వద్ద ఆటో అదుపు తప్పడంతో ఎలీషా(40), రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఎలీషా మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న పీఓ రవీంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ రవీంద్రనాథ్‌రెడ్డి గిరిజనులకు సూచించారు. శుక్రవారం స్థానిక చెంచు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలందరికీ ఉన్నత విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తోందన్నారు. పిల్లలను బడికి పంపితే అమ్మ ఒడి డబ్బు, వసతి దీవెన, విద్యా దీవెన డబ్బుతో పాటు పుస్తకాలు, యూనిఫాం, షూ, బ్యాగ్‌లు, పౌష్టికాహారం, అందజేస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ దస్తగిరి, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, ప్రిన్సిపాల్స్ క్రిష్ణానాయక్, సలోమీ, మాధవి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నంద్యాల జిల్లాకు మొదటిస్థానం

- 11వ స్థానంలో కర్నూలు జిల్లా

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ముగిసింది. డిసెంబర్ నెలకు సంబంధించి పంపిణీ 7వ తేదీ వరకు కొనసాగింది. పలు జిల్లాల్లో మిచాంగ్ తుపాను ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల పింఛన్ల పంపిణీని ప్రభుత్వం రెండు రోజులు పొడిగించింది. పంపిణీలో నంద్యాల జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానం దక్కించుకోగా.. కర్నూలు జిల్లా 11వ స్థానంలో నిలిచింది. గ్రామ, వార్డు వలంటీర్లు వ్యయ ప్రయాసలకోర్చి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి దగ్గరకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం విశేషం.

➡ కర్నూలు జిల్లాలో 2,45,320 పింఛన్లు ఉండగా 2,43,445 మంది లబ్ధిదారులకు రూ.67,71,76,00 నగదు పంపిణీ చేశారు. 99.22 శాతం పంపిణీ పూర్తయింది.

➡ నంద్యాల జిల్లాలో 2,21,508 పింఛన్లు ఉండగా 2,20,209 మంది లబ్ధిదారులకు రూ.60,80,61,250 నగదు పంపిణీచేశారు. 99.41 శాతం పంపిణీ పూర్తయింది.

భూ సర్వే పకడ్బందీగా చేపట్టండి


భూ సర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ

గడివేముల: భూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో జరుగుతున్న జగనన్న భూ సర్వేను తనిఖీ చేశారు. అనంతరం 220 కేవీ సబ్‌స్టేషన్ కోసం భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అనుభవంలో ఉన్నవారికి శాశ్వత భూ హక్కు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో భూములు కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ మాలిక్‌బాషా ఉన్నారు.

క్రీడా ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం

- పతకాలు సాధించిన క్రీడాకారులకు వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాలు
- జిల్లా నుంచి నలుగురు ఎంపిక
- ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున అందజేత

కర్నూలు (టౌన్): ప్రతిభ చాటిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాలను అందిస్తోంది. వీటికి జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. అక్టోబర్ 26 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు గోవా రాష్ట్రంలో 37వ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం గజ్జిహళ్లి గ్రామానికి చెందిన డి. వెంకటేష్ మోడ్రన్ పెంటాథ్లాన్ క్రీడాంశంలో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. అలాగే సెపక్‌తక్రా క్రీడాంశంలో కర్నూలు నగరానికి చెందిన సి. అశోక్‌కుమార్, సి. శివకుమార్, ఎస్‌కె. షేక్ మాలిక్‌బాషా సత్తా చాటి కాంస్య పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వీరిని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాలకు ఎంపిక చేసింది. వీరికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున నేరుగా వారి బ్యాంక్ అకౌంట్లలో నగదును జమ చేసింది. వ్యక్తిగత ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందించడంపై క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా వికాసం

రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు చేయూతనిస్తోంది. క్రీడల్లో ప్రతిభ చాటే క్రీడాకారులకు 2019 నుంచి వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాల పేరుతో నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. గత ప్రభుత్వం క్రీడలను పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రీడల నిర్వహణ చేయూతనిస్తోంది. దీంతో ఎంతో మంది క్రీడాకారులను వెలుగులోకి వస్తోంది. ఇప్పటికే స్కూల్‌గేమ్స్ క్రీడాపోటీలు, ఏపీ సీఎం కప్ పోటీలు నిర్వహించింది. తాజాగా ఈనెల 15 నుంచి 50 రోజుల పాటు ఆడుదాం- ఆంధ్రా పేరుతో క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చదువుతో పాటు క్రీడలను నిర్వహించడం, క్రీడావసతులు పెంచడం, క్రీడా మైదానాలను మెరుగుపరచడం వంటి చర్యలు చేపడుతోంది.

చాలా సంతోషంగా ఉంది



నేను ఎంబీఏ పూర్తి చేశా. ప్రస్తుతం అమెజాన్‌లో ఉద్యోగం చేస్తున్నా. సెపక్‌తక్రా క్రీడ అంటే ఎంతో ఇష్టం. గతంలో క్రీడాకారులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఉండేవి కావు. ప్రస్తుత ప్రభుత్వం నా ప్రతిభను గుర్తించి రూ. 3 లక్షలు అందజేయడం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి ప్రోత్సాకాలు ఇస్తే రాబోయే రోజుల్లో క్రీడలకు మరింత ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంది. - ఎస్‌కె. షేక్ మాలిక్ బాషా

క్రీడాకారుల సంఖ్య పెరిగింది



ప్రతిభ చాటుతున్న క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం శుభ పరిణామం. రాబోయే రోజుల్లో మరింత మంది క్రీడాకారులు వెలుగులోకి రానున్నారు. గతంతో పోల్చితే మూడేళ్లలో జిల్లాలో క్రీడల్లో ప్రతిభ చాటుతున్న వారి సంఖ్య బాగా పెరిగింది. జిల్లా నుంచి ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. - శ్రీనివాసరావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి